

క్వార్టర్ల కూల్చివేత ప్రక్రియ ప్రారంభం 8లో..

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలగకుండా చూడాలి 8లో..

నత్తనడకన ఆర్వోబీ పనులు



● ప్రారంభంలో వేగం.. ఆరు మాసాల నుంచి తగ్గిన వైనం ● త్వరగా పూర్తి చేయాలని కోరుతున్న ప్రజలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి పట్టణంలోని కూనారం క్రాస్ రోడ్డులో గల రైల్వే క్రాసింగ్ వద్ద చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయి. రెండు వరుసల్లో ఫోర్ లైన్స్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టారు. పెద్దపల్లి పట్టణం వైపు పిల్లర్లు పూర్తి చేసి స్లాబ్ పనులు చేస్తున్నారు. గేట్ అవతలి వైపు పిల్లర్లు మాత్రమే పూర్తయ్యాయి. రెండేళ్లలో పనులు పూర్తి కావాల్సి ఉండగా, ఇప్పటికే పనులు ప్రారంభమై ఏడాదిన్నర గడిచింది. మరో ఏడాదైనా పనులు పూర్తయ్యే అవకాశాలు కనబడడం లేదు. కాంట్రాక్టర్ పనులను వేగంగా చేపడుతున్నట్లుగా కనబడడం లేదు. ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి 2022లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 119 కోట్ల 50 లక్షల రూపాయలు మంజూరు చేశాయి.

అదే ఏడాది సెప్టెంబర్‌లో పనులకు టెండర్లు దాఖలు కాగా, అదే నెలలో ఒప్పందాలు కుదిరాయి. అక్టోబరు 10న రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి భూమి పూజ చేశారు. రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఆరంభం లో పనుల్లో వేగం పెంచిన కాంట్రాక్టర్ ఆ తర్వాత పనుల్లో వేగం మందగించింది. మధ్యలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు జరగడంతో బిల్లులు చెల్లింపుల్లో జాప్యం అయ్యాయి. దీంతో పనులు ముందుకు సాగడం లేదు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

పెద్దపల్లి నుంచి కాల్వ శ్రీరాంపూర్, తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు పెద్దపల్లి పట్టణంలోని కూనారం రైల్వే క్రాసింగ్ వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని ఎన్నాళ్లుగానో డిమాండ్ ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ బ్రిడ్జి నిర్మాణానికి చొరవ తీసుకోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఈ బ్రిడ్జి నిర్మాణానికి 119 కోట్ల 50 లక్షలు మంజూరు చేస్తూ 2022 జనవరి 21న రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

దీంతో పాటు రాష్ట్రంలో మరో నాలుగు చోట్ల ఆర్వోబీలను మంజూరు చేశారు. సికింద్రాబాద్-నుంచి న్యూఢిల్లీ వరకు గల అతిపెద్ద రైల్వేలైన్ పెద్దపల్లి గుండా పోతున్నది. ఈ లైన్‌లో అనేక ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్, ప్యాసింజర్ రైళ్లతో పాటు గూడ్స్ బండ్లు నడుస్తుంటాయి. దీంతో చీటికి, మాటికి గేట్లు పడుతుండడంతో పెద్దపల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్ కు వెళ్లే రహదారిలో, పెద్దపల్లి నుంచి మంథనికి వెళ్లే రహదారిలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 25 ఏళ్ల క్రితం పెద్దపల్లి నుంచి మంథనికి వెళ్లేందుకు ఓవర్ బ్రిడ్జిని నిర్మించడంతో ఆ దారి గుండా ప్రయాణించే వాహనదారుల కష్టాలు తీరాయి.

పెద్దపల్లి పట్టణం నుంచి కాల్వ శ్రీరాంపూర్ వెళ్లే రహదారిలో కూనారం క్రాస్ రోడ్డులో రైలు గేట్ పడుతుండడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. పిల్లర్ల పనులు పూర్తయినప్పటికీ, వాటిపై స్లాబు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పనుల్లో వేగం పెంచని కారణంగా పనులు చాలా ఆలస్యం అవుతున్నాయి. సంబంధిత కాంట్రాక్టర్ కావాల్సిన మ్యాన్ పవర్, మెటీరియల్‌ను అందుబాటులోకి తీసుక రావడం లేదు. కేవలం కొంత మంది మాత్రమే పని చేస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు పనుల్లో వేగం పెంచడంలో చొరవ చూపడం లేదని కనబడుతున్నది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రైల్వే గేటు అవతల పూర్తయిన పిల్లర్ల పనులు

జాతీయ రహదారి భూ సేకరణ పూర్తి చేయాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిటౌన్, జూన్ 28: వరంగల్-మంచిర్యాల మధ్య ఫోర్‌లైన్ల గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మంచిర్యాల-వరంగల్ జాతీయ రహదారి భూసేకరణపై అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్‌తో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జాతీయ రహదారి నిర్మాణానికి జిల్లాలో 204.46 హెక్టార్ల భూసేకరణ చేయాల్సి ఉండగా, ముందస్తుగా ఫిబ్రవరి 23, 2024న 152.26 హెక్టార్ల భూమి నోటిఫై చేసి పబ్లిక్ నోటీస్ 1 జారీ చేశామని, 60 రోజుల గడువు ముగిసిన తర్వాత మే 8, 2024న పబ్లిక్ నోటిస్ విడుదల చేశామని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారుల నిర్మాణం కోసం అవసరమైన భూసేకరణ త్వరగా పూర్తిచేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. జిల్లాలో జాతీయ రహదారి నిర్మాణానికి పెండింగ్ ఉన్న భూసేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తిచేయాలని, జాతీయ రహదారి నిర్మాణంవల్ల భూములు కోల్పోతున్న వారికి నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ జారీ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ఇంజనీరింగ్, రెవెన్యూ సర్వేయర్లు క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి జాతీయ రహదారి నిర్మాణం వల్ల నష్టం జరిగే చెట్లు, బావులు, ఇళ్లు మొదలగు వాటిని సర్వే నిర్వహించి నష్టపరిహారం చెల్లించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని, జాతీయ రహదారుల నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకొని అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో మంథని రెవెన్యూ డివిజన్ అధికారి హనుమా నాయక్, తహసీల్దార్‌లు, అసిస్టెంట్ డైరెక్టర్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, కలెక్టరేట్ విభాగం సూపరింటెండెంట్ సునీత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ : ఎమ్మెల్యే

పెద్దపల్లిటౌన్, జూన్ 28: డబుల్ బెడ్రూం లబ్ధిదారులకు శనివారం స్థానిక అమర్‌చంద్ కల్యాణ మండపంలో ఇళ్ల పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే విజయరమణారావు తెలిపారు. శుక్రవారం 19, 34 వార్డుల్లో సందర్శించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులకు ఈ ప్రభుత్వం అందించేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. గతంలో ఇక్కడే ఎంపిక చేసిన లబ్ధిదారులకే ఇళ్లు కేటాయించి ఇంటి నంబర్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అమర్ చంద్ కల్యాణ మండపంలో ఉదయం తొమ్మిదిన్నర గంటల వరకు రావాల్సిందిగా కోరారు. అలాగే ఇళ్లులేని నిరుపేదలకు స్థలం ఉంటే నిర్మించు కునేందుకు 5 లక్షల రూపాయలు ఇవ్వనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల ఆశ చూపించి ఓట్లు వేయించుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందన్నారు. ఇప్పటికే ఆరు గ్యారెంటీల్లో ఐదు అమలవుతున్న సంగతి ప్రజలు గమనిస్తున్నారని వివరించారు. 19. 34 వార్డుల్లో అనేక సమస్యలున్నాయన్నారు. డ్రైనేజి, సీసీ రోడ్లు, నల్లాల లీకేజీ లున్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాల్సిందిగా కమిషనర్ ఆకుల వెంకటేష్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప్పు రాజు, సయ్యద్ మస్రత్, నూగిళ్ళ మల్లయ్య, భూతగడ్డ సంపత్, బొడ్డుపెల్లి శ్రీనివాస్, అమ్రీష్, మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, ఇంటజనీర్ ఏఈ సతీష్, అనీల్, రామ్మోహన్‌రెడ్డి, తదితరులున్నారు.

గురుకుల విద్యాలయాల టెండర్లు ఖరారు

పెద్దపల్లిటౌన్, జూన్ 28: పారదర్శకంగా సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాలకు సంబంధించి పలు టెండర్లు ఖరారు చేసినట్లు అదనపుకలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ సాంఘీక సంక్షేమ శాఖకు సంబంధించి పలు అంశాలపై దాఖలైన టెండర్లను ఓపెన్ చేశారు. జిల్లాకు సంబంధించి 6 సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాలకు సరఫరా నిమిత్తం ఫుడ్ ప్రొవిజన్స్ కోడిగుడ్లు, చికెన్, పండ్లు, కూరగాయల సరఫరాకు సంబంధించిన టెండర్లను ఓపెన్‌చేసి ఖరారు చేశారు. కార్యక్రమంలో పెద్దపల్లి సాంఘీక సంక్షేమ శాఖ విద్యాలయాల సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ జే.జే.థెరిస్సా, డీపీసీ సభ్యులు, ప్రిన్సిపాల్, టెండర్‌దారులు తదితరులు పాల్గొన్నారు.

ఓదెలలో విజృంభిస్తున్న జ్వరాలు

ఓదెల, జూన్ 28 : మండల కేంద్రంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇంటింటికీ జ్వర పీడితులు అధికమవుతున్నారు. గ్రామంలో 500మందికి పైగా బాధితులున్నట్లు తెలుస్తోంది. గ్రామంలో దాదాపు రెండు వందల మందికిపైగా జమ్మికుంట, పెద్దపల్లి, కరీంనగర్ ఆసుపత్రిలకు వెళ్లి వైద్య పరీక్షలు చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి ఓదెలతో పాటు ఇతర గ్రామాల్లో తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గర్భిణుల ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వాసుపత్రిని సందర్శిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

కాల్వశ్రీరాంపూర్, జూన్ 28: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 100శాతం గర్భిణుల ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం ఆయన కాల్వశ్రీరాంపూర్ మండలంలోని కాల్వశ్రీరాంపూర్, కూనారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆపరేషన్ థియేటర్, జనరల్ వార్డ్, లేబర్‌రూమ్, ఫార్మసీ, ల్యాబరేటరీలను పరిశీలించి ప్రజలకు అందుతున్న వివిధ సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతిరోజు నమోదవుతున్న ఔట్ పేషెంట్, ఆసుపత్రిలో జరుగుతున్న ప్రసవాల సంఖ్య, పోషకలోపం ఉన్న పిల్లల కేసులు, ఎన్‌సీడీ సర్వే తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన కలెక్టర్

మండలంలోని వెన్నంపల్లి, మంగపేట, కునారం, పెగడపల్లి గంగారం, కాల్వశ్రీరాంపూర్‌లలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. పాఠశాలల్లో, అంగన్‌వాడీ సెంటర్లలో కలెక్టర్ కోయ శ్రీహర్ష విద్యార్థులకు కొద్దిసేపు విద్యా బోధన చేశారు. పాఠ్యాంశాల నుంచి వారు నేర్చుకున్న పాఠాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిశీలించి పూర్తిచేయాలని తహసీల్దార్ జాహెద్‌పాషాకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు కృపాభాయ్, వాణిశ్రీ, ఎంపీడీవో రామ్మోహనచారి, తహసీల్దార్ జాహెద్ పాషా, ఏఈ మల్లేశం, తదితరులు పాల్గొన్నారు..

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ రమసురేష్‌రెడ్డి

మంథని, జూన్ 28: వర్షాకాలంలో సీజన్ వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పలు వార్డుల్లో డ్రైడేను ఆమె నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె ప్రజలతో మాట్లాడుతూ.. ఇంట్లో, పరిసరాల్లో నీళ్లు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీళ్లు నిల్వడంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఇంటి పరిసరాల్లో ఏ వస్తువులో కూడ నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈవిషయంలో మున్సిపల్ సిబ్బందికి అయా వార్డుల్లోని ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ గుట్టల మల్లికార్జునస్వామి, కౌన్సిలర్లు, మున్సిపల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

1న సదరం స్లాట్ బుకింగ్

పెద్దపల్లిటౌన్, జూన్ 28: దివ్యాంగుల వైద్య నిర్ధారణ పరీక్షల కోసం జూలై 1న సోమవారం ఉదయం 11.35 గంటల నుంచి మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఆర్.రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా సదరం సర్టిఫికెట్ కావాల్సిన వారు, తాత్కాలిక సదరం సర్టిఫికెట్ ఉన్నవారు రెన్యువల్ కోసం దరఖాస్తులు చేసుకోవాలని, మానసిక అంగవైకల్యం, బుద్ధిమాంద్యం ఉన్నవారు జూలై 11న నిర్వహించే క్యాంప్ స్లాట్ కోసం, దృష్టి లోపం, వినికిడి లోపం ఉన్నవారు జూలై 18న నిర్వహించే క్యాంప్ స్లాట్ కోసం, శారీరక అంగవైకల్యంగలవారు జూలై 4, జూలై 25 నాటి క్యాంప్ స్లాట్ కోసం జూలై 1న ఉదయం 11.35 గంటల నుంచి మీ సేవా కేంద్రాల్లో స్లాట్ నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. స్లాట్ బుకింగ్ అనంతరం మెడికల్ క్యాంపులకు వచ్చే సందర్భంలో దరఖాస్తుదారులు మీసేవ సదరం స్లాట్ బుకింగ్ రసీదుతో పాటు వికలాంగత్వ పరీక్షా కాపీ, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, వ్యక్తిగత మెడికల్ రిపోర్ట్‌లను తీసుకొని రావాలని పేర్కొన్నారు. కొత్తగా సదరం సర్టిఫికెట్ కావాల్సిన వారు ఇంతకు మునుపే మీసేవ కేంద్రంలో స్లాట్ బుక్ చేసినట్లయితే మీరు ఇచ్చిన మొబైల్ నంబర్‌కు డిపార్ట్మెంట్ ద్వారా క్యాంప్ వివరాలు మెసేజ్(ఎస్.ఎం.ఎస్.) ద్వారా వస్తాయని పేర్కొన్నారు. సదరు మొబైల్ ఫోను తప్పనిసరిగా క్యాంపునకు తీసుకొని రావాలని డీఆర్‌డీవో ఆర్. రవీందర్ ప్రకటనలో తెలిపారు.

వివాదంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

● దళిత ఉద్యోగిపై దుర్భాషలు

న్యూఢిల్లీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ వివాదంలో చిక్కుకున్నారు. తెలంగాణ భవన్‌కు చెందిన దళిత ఉద్యోగిపై తీవ్రదుర్భాలాడారు. తన రూంలో నీళ్లు రాకపోవడంతో సదరు ఎమ్మెల్యే భవన్ ఉద్యోగిపై మండిపడ్డారు. శుక్రవారం, తెలంగాణ భవన్‌లో పీవీ జయంతి సందర్భంగా నివాళి అర్పించే కార్యక్రమానికి హాజరయ్యేందుకు మక్కాన్‌సింగ్ రెడీ అయ్యే సమయంలో నీళ్లు రాలేదు. దీంతో ఆగ్రహం చెందిన ఎమ్మెల్యే కార్యక్రమం దగ్గరికి వచ్చి ఇన్‌చార్జ్ ఎవరంటూ అడిగి సదరు ఉద్యోగిపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ తీవ్రదూషణలకు దిగారు. అంతేకాకుండా కొద్ది దూరంలో ఉన్న మంత్రుల వద్దకు వెళ్లి ఉద్యోగిపై ఫిర్యాదుచేశారు. అయితే ఆ ఉద్యోగి మాత్రం నిమ్మకుండిపోయారు. భవన్ ఉన్నత దోగ్యులు రెసిడెంట్ కమిషనర్‌కు మౌఖికంగా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఢిల్లీలో శుక్రవారం తెల్లవారు జామును కురిసిన భారీ వర్షం వల్ల మెటార్లు నీటమునిగి నీటి సరఫరాకు అంతరాయం కలిగిందని భవన్ ఉద్యోగులు తెలిపారు.

అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్

- ఏడు నెలలైనా ఏ ఒక్క హామీ అమలు చేయలేదు - ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగానే పనిచేశాం

- ఐదేళ్లు సహకరించిన జిల్లా అధికారులకు కృతజ్ఞతలు - జడ్పీ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ పుట్ట మధు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధు

జ్యోతినగర్, జూన్ 28 : ఎన్నికల సందర్భంగా కేసీఆర్ పాలనపై అబద్ధాలు ప్రచారం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని జడ్పీ చైర్మన్ పుట్ట మధు స్పష్టం చేశారు. పదుల ఎకరాలు ఉన్న రైతులకు రైతుబంధు ఇచ్చి ప్రజల సొమ్మును దుబారా చేశారంటూ కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేసిందని, అయితే జిల్లాలో, రాష్ట్రంలో 98శాతం మంది రైతులు 5 ఎకరాల లోపున్న, సన్నకారు రైతులేనని లెక్కలు చెబుతున్నాయన్నారు. శుక్రవారం ఎన్టీపీసీ ఈడీసీ మిలీనియం హాలులో జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించిన పుట్ట మధు వ్యవసాయంపై జరిగిన చర్చ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం, ఆరోపణలు చేసిందని, అనేక హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. సర్కారు పగ్గాలు చేపట్టి 7 నెలలు అవుతున్నప్పటికీ ఏ ఒక్క హామీని అమలు చేయలేదని ఆరోపించారు. రైతు భరోసా కింద రైతులకు పెట్టుబడి సాయం అందించడం లేదని, 500 రూపాయల బోనస్ అమలుకావడం లేదని, 2 లక్షల రుణమాఫీ చేయలేదని అన్నారు.

జిల్లాలో ప్రజల సంక్షేమం కోసమే 5 సంవత్సరాలు పని చేశామన్నారు. వచ్చేనెల 4తో జడ్పీటీసీల కాలపరి మితి ముగుస్తున్నదని, ఈ ఐదేళ్లలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశామన్నారు. 20 సర్వసభ్య సమావేశాలు నిర్వహించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేశామని తెలిపారు. దేశంలోనే జిల్లా పరిషత్ సమా వేశం అత్యున్నత సభగా తాను భావిస్తా నని అన్నారు. అసెంబ్లీ, పార్లమెంటులో ఎమ్మెల్యే, ఎంపీలు మాత్రమే ఉంటారని, జడ్పీ సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యేలు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు కూడా పాల్గొంటారన్నారు.

ఆగస్టు 15లోగా రుణమాఫీ చేయాలి

వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధిపై జడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ అంశాలకు సంబంధించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి జిల్లా అధికారులు సభలో వివరించారు. వానా కాలం పంట సీజన్ ప్రారంభమైన సందర్భంగా రైతులకు రైతు భరోసా నిధులు, రైతు కూలీలకు 12 వేల రూపాయలు పంపిణీ చేయాలని, అదేవిధంగా ఆగస్టు 15లోగా 2 లక్షల రూపాయల రుణమాఫీ అమలు చేయాలని, ధాన్యానికి 500 రూపాయల బోనస్ చెల్లించాలని కోరుతూ తీర్మానం ప్రవేశపెట్టాలని ఓదెల జడ్పీటీసీ గంట రాములు కోరగా, పాలకుర్తి జడ్పీటీసీ కందుల సంధ్యారాణి బలపర్చారు. అందరు సభ్యుల అంగీకారంతో తీర్మానాన్ని చైర్మన్ అమోదించారు. విద్యాశాఖపై జరిగిన చర్చలో జిల్లాలో ఉన్న నైపుణ్యం, అనుభవం ఉన్న ఉపాధ్యాయుల వివరాలు తెలియజేస్తూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని సభ్యులు సూచించారు. గతంలో ప్రారంభించిన సీఎం అల్పాహారం పథకంపై సభ్యులు ఆరా తీశారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా పాఠశాలల మరమ్మతు పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. పోషకాహారం లోపం ఉన్న పిల్లలను ముందే గుర్తించి అవసరమైన చికిత్స అందించాలని, దీని కోసం పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. డయాగ్నస్టిక్ హబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షలకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని, ప్రైవేటు ల్యాబుల్లో పరీక్షలు చేయించుకొని ప్రజలు డబ్బులు వృథా చేసుకోకుండా చూడాలని సభ్యులు కోరారు. ఈ ఐదేళ్ల తమకు సహకరించిన జిల్లా అధికారులు, సిబ్బంది, మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జడ్పీ సీఈవో కె.నరేందర్, జడ్పీటీసలు, ఎంపీపీలు, కోఆప్షన్ సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నాం. జడ్పీ చివరి సమావేశం సందర్భంగా చైర్మన్ పుట్ట మధు, సభ్యులను ఘనంగా సన్మానించారు.

సామాన్యులకు పన్నులు భారం కాకుండా చూడాలి

- మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే విజయరమణారావు



సమావేశంలో విద్యుత్ ఏఈని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, జూన్ 28: మున్సిపాలిటీ వారు నిర్ణయిస్తున్న పన్నుల మూలంగా పేద ప్రజలు సామాన్యులు ఇబ్బందులు పడరాదని, ఈ పన్నులు వారికి భారం కాకుండా చూడాలని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మున్సిపల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ గాజుల లక్ష్మిరాజమల్లు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఇందులో మొదటిసారిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ పన్నుల విధానాన్ని ఆయన అధ్యయనం చేశారు. కమిషనర్ కట్ల వేణుమాధవ్, మేనేజర్ అలీమోద్దీన్ తదితర అధికారులతో వివరాలు తెలుసుక్ను అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏకపక్షంగా పన్నులు పెంచి ప్రజలను వ్యాపారులను, సామాన్యులను ఇబ్బందుల పాలు చేశారని దీన్ని సవరించాలని అన్నారు. గతంలో ఉన్న పన్నుల విధానాన్ని అమలు చేయాలని కొత్తగా పెంచిన పన్నుల వల్ల సామాన్యులతో పాటు వ్యాపారాలు ఇతర వర్గాలు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నందున వీటిని తగ్గించే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో రెండు మూడు రోజుల తర్వాత సమీక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఆ తర్వాత వ్యాపారులు ఇతర వర్గాల వారితో కూడా చర్చించి వారికి అమోదయోగ్యమైన పన్నుల విధానాన్ని రూపొందించాలని సూచించారు. మున్సిపల్ తీర్మానం చేసి పన్నులు పెంచే విధానం సరికాదదన్నారు.

విద్యుత్ ఏఈని నిలదీసిన ఎమ్మెల్యే..

పట్టణంలో విద్యుత్ సరఫరా అస్తవ్యస్థం ఉండడాన్ని, సమస్య ఉన్నపుడు సకాలంలో సత్వరంగా స్పందించడంలో విఫలం అవుతున్నారని ఎమ్మెల్యే విజయరమణారావు ఏఈని ప్రశ్నించారు. పైన విద్యుత్ ఉన్నా కూడా స్థానికంగా ఏదో చిన్న చిన్న సాంకేతిక సమస్య ఉత్పన్నం అయితే వాటిని కూడా సకాలంలో సత్వరంగా సరిదిద్దలేని మీ పని తనం బాగాలేదని నిలదీశారు. పని తీరు మెరుగుపరచుకోవాలని సూచించారు. ప్రజలు తరచూ తనకు ఫోన్ చేసి సమస్య గురించి ప్రస్తావిస్తున్నారని, ఇక ముందు పట్టణంలో విద్యుత్ సమస్య రాకుండా చూడాలన్నారు. అంతకుముందు ఈ సమస్యపై కౌన్సిలర్లు గుర్రాల శ్రీనివాస్, దున్నపోతుల రాజయ్య ఎమ్మెల్యే విజయరమణారావు దృష్టికి తెచ్చారు.

● కొత్త రోడ్లకు నిధులు కేటాయించండి..

- చైర్‌పర్సన్ లక్ష్మిరాజమల్లు

సుల్తానాబాద్ పట్టణంలోని పలు ప్రధాన వీధుల్లో రోడ్ల విస్తరణ పనులు కొనసాగుతున్నాయని, కొన్ని చోట్ల పూర్తయ్యాయని వాటిలో నూతన రోడ్ల నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని చైర్‌పర్సన్ గాజుల లక్ష్మిరాజమల్లు ఎమ్మెల్యేను కోరారు. దశల వారీగా తాను సుల్తానాబాద్ పట్టణ అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తైబజార్ వసూళ్ల అంశంపై సమావేశంలో చర్చరాగా ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. స్థానికులకు మినహాయించాలని అన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత క్రిష్ణ, కౌన్సిలర్లు పారుపల్లి జ్ఞానేశ్వరి, గొట్టం లక్ష్మి, అరుణ, సునిత, రాజయ్య, గోపీ, వరప్రదీప్, గుర్రాల శ్రీనివాస్ తిరుపతి కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





అడుగుకో గుంత

- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

వీణవంక, జూన్ 28: మండలంలోని చల్లూరు నుంచి మాల్లారెడ్డిపల్లికి వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలుపడ్డాయి. ఓ వైపులు గుంతలు, మరోవైపు కంకర తేల డంతో ఈ రోడ్డుపై ప్రయాణించడానికి ప్రజలు


గుంతల్లో నిలిచిన వర్షం నీరు


గుంతలు పడిన రోడ్డు

తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ గ్రామానికి తారురోడ్డు నిర్మిస్తామని పాలకులు చెబుతున్నా అధికారులు మరమ్మతు లు చేపట్టడంలో అలసత్వం ప్రదర్శించడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రు. ఇటీవల మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేర డంతో అవి ఎంత లోతు ఉన్నాయో తెలువక వాహనదారులు అదుపు తప్పి పడిపోతున్నారు. రాత్రి సమయంలో అత్యవసరమైన పనుల పై వెళ్లే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో ఈ ప్రాంతంలో గ్రానైట్, ఇసుక క్వారీలకు అనుమతులు ఇవ్వ డంతో లారీలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగించాయి. లారీల్లో పరిమితికి మించి సామగ్రి తరలించడం వల్ల రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. అదికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బీడీ కార్మికులకు పెరిగిన కూలీని అందించాలి



మాట్లాడుతున్న మూషం రమేష్

సిరిసిల్ల రూరల్, జూన్ 28: బీడీ కార్మికులకు పెరిగిన రూ 249.99 పైసలను మే 1వ తేదీ నుంచి అందించడంతో పాటు తక్కువ కూలీ చెల్లిస్తున్న బీడీ కంపెనీల యజమానులపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ బీడీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం బీడి వర్కర్స్ యూనియన్ సమావేశంలో గౌరవ అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ జూలై 5 నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా బీడి వర్కర్స్ బస్తీ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్మిక సంఘాల ఐక్య పోరాటాల ఫలితంగా బీడి కార్మికులు ప్యాకర్లు, నెలవారీ ఉద్యోగులకు వేతనాలు పెరిగాయన్నారు. కొన్ని కార్మిక సంఘాలు తమ వ్యక్తిగత ప్రయోజనం కోసం మేమే వేతనాలు పెంచామని కార్మికులను మభ్య పెడుతున్నారన్నారు. అలాంటి వారి మాటలను కార్మికులు నమ్మవద్దని గుర్తింపు పొందిన సంఘాల ఐక్య పోరాటం ఫలితంగానే వేతనాలను యజమానులు పెంచార న్నారు. పెంచిన వేతనాలను మే 1 నుంచి అమలవుతున్నాయని జూన్ నెల వచ్చే వేతనం కార్మికులందరికీ పెంచిన వేతనాన్ని ఇవ్వాలన్నారు. వెయ్యి బీడీలకు రూ 249.99 పైసలను బీడి కార్మి కులకు ప్యాకర్లకు నెలకు రూ. 3,650, నెలవారీ ఉద్యోగులకు రూ. 1,700 చొప్పున పెరిగిన జీతంను యజమాన్యాలు అందించాలని కోరారు. సమావేశంలో బీడి వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గోవిందు లక్ష్మణ్, జిల్లా నాయకులు నూరం పద్మ, బెజుగం సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్లు జైలు

శంకరపట్నం, జూన్ 28: పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు 10వేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా స్పెషల్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు న్యాయమూర్తి డి వెంకటేష్ శుక్రవారం తీర్పు ఇచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలంలోని మెట్‌పల్లి గ్రామంలో ఒంగోలు జిల్లాలోని సంతనూతలపాడు మండలం చిలకపాడు గ్రామానికి చెందిన దాసరి అంజి మేస్త్రీ పని చేస్తూ ఒంటరిగా ఒక ఇంట్లో కిరాయికి ఉండేవాడు. అంజి దగ్గరికి ఓ బాలిక కూలీ పనికి వెళ్లేది. ఈ పరిచయడంతో ఆమెను పెళ్లి చేసుకుంటానని తన వెంట సొంత గ్రామమైన చిలకపాడుకు తీసుకెళ్లాడు. కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి బాలికను ఇంటికి తీసుకు వచ్చారు. అనంతరం నవంబరు 28, 2016న కుటుంబ సభ్యులు పనికి వెళ్లాగా బాలికకు అనారోగ్యంగా ఉండడంతో ఆమెను ఇంటి వద్దే ఉంచారు. కూలీ పనికి వెళ్లిన తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూడగా కూతురు ఇంట్లో కనిపించ లేదు. కుటుంబ సభ్యులు గ్రామంలో బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో అంజి సొంతూరు చిలకపా డుకు వెళ్లి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు అంజిని కోర్టులో హాజరు పరిచారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన ప్రత్యేక పాస్ట్ ట్రాక్ కోర్టు పోక్సో న్యాయ మూర్తి డి వెంకటేష్ నిందితుడిపై నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు 10వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్టు

- నాలుగు కిలోల గంజాయి స్వాధీనం
- 30 గ్రాముల చాక్‌లెట్స్ సీజ్


మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జూన్ 28: జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ కేంద్రాలుగా గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అరెస్ట్‌చేసి వారి వద్ద నాలుగు కిలోల 700గ్రాముల గంజాయిని, మరో 30 గ్రాముల గంజాయి చాక్‌లెట్స్‌ను, నాలుగు మొబైల్స్, రెండు బ్యాగులు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు, మరో ఇద్దరు గంజాయి విక్రేతలు పరారీలో ఉన్నారని ఎస్పీ అఖిల్ మహజన్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో నలుగురు గంజాయి విక్రేతలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన వివరాలు వెల్లడించారు. ఇందులో పెద్దపల్లి జిల్లాలోని పెద్దబొంకూరు గ్రామానికి చెందిన కలవేన ప్రవీణ్‌కుమార్ (22), సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన పెరుక వెంకటేశ్ (19), మంచిర్యాల జిల్లా మదురానగర్‌కు చెందిన నార్ల అక్షయ్ (18), హైద్రాబాద్‌లోని రాంనగర్‌కు చెందిన అలెగ్జెండర్ జోసెఫ్ (43)ను అరెస్ట్‌చేశామన్నారు. పెద్దపల్లి జిల్లాలోని అమర్‌నగర్ కు చెందిన బండి సాయిచరణ్ (21), కరీంనగర్ జిల్లాలోని నుస్తులాపూర్ గ్రామానికి చెందిన మీస సాయిరామ్ (19)లు పరారీలో ఉన్నారని తెలిపారు. కలవేన ప్రవీణ్ అనే వ్యక్తి ఓ ఆసుపత్రిలో నర్సింగ్ కోర్సు చేస్తు కరీంనగర్ జిల్లా బొమ్మకల్‌లో సాయిచరణ్, సాయి బిబ్బిలతో కలిసి రూమ్ అద్దెకు తీసుకున్నాడని తెలిపారు. సాయిచరణ్, ప్రవీణ్‌లు అక్షయ్‌కి తెలిసిన వ్యక్తి వద్ద భద్రాచలంలో గంజాయిని కొనుగోలుచేసి అద్దె గదిలో పెట్టుకొని ముగ్గురు కలిసి వేములవాడ, సిరిసిల్లలో ఫోన్స్ ద్వారా విక్రయిస్తున్నారన్నారు. నాలుగు రోజుల క్రితం ప్రవీణ్, సాయిచరణ్ కలిసి ఓ తెలిసిన వ్యక్తి వద్ద గంజాయిని, గంజాయితో తయారుచేసిన చాక్లెట్స్‌ను కొనుగోలు చేశారు. వాటిని తీసుకొని శుక్రవారం సిరిసిల్లలోని కొత్తచెరువు వద్ద మకాం వేయగా, వెంకటేశ్, అక్షయ్, జోసెఫ్ చేరుకొని తెలిసిన వారిని గంజాయి, గంజాయి చాక్లెట్స్‌ను విక్రయిస్తున్నారని తెలిపారు. పక్కా సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకొని పట్టుకునేందుకు ప్రయత్నిస్తుండగా సాయి చరణ్, సాయి రాంలు గంజాయి, డబ్బులతో పరారయ్యారన్నారు. దీంతో అక్కడే ఉన్న మిగితా విక్రేతలైన ప్రవీణ్, వెంకటేశ్, అక్షయ్, జోసెఫ్‌లను పట్టుకుని వారి వద్ద నాలుగు కిలోల 700 గ్రాముల గంజాయిని, 30 గ్రాముల గంజాయి చాక్లెట్‌లను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, టౌన్ సిఐ రఘుపతి, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ శ్రీకాంత్ పాల్గొన్నారు.





2,19,038 క్వింటాళ్ల బియ్యం పక్కదారి

- మిల్లు యజమానులపై కేసు నమోదు

ఇల్లందకుంట/జమ్మికుంట జూన్ 28: జమ్మికుంట, ఇల్లందకుంటలోని సీతారామ పారా బాయిల్డ్, మహాశక్తి రైస్‌మిల్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు. ఎస్ఐ రాజకుమార్ తెలిపిన వివరాల ప్రకారం సీతారామ రైస్‌మిల్ యజమానులకు 2022-23 నుంచి 2023-24 సంవత్సరానికి సంబంధించి సివిల్ సప్లయీ వాళ్ల 2,19,038.28 క్వింటాళ్ల వడ్లు మిల్లింగ్ చేయాలని అప్పగించారు. ప్రభుత్వానికి బియ్యం అప్పగించకపోవడం, మిల్‌లో ఉండాల్సిన వడ్లను, బియ్యం పట్టించి వేరే వైపు మళ్లించి ఎక్కువ ధరకు అమ్ముకున్నట్లు గురువారం అధికారులు చేపట్టిన తనిఖీలో నిర్ధారణ అయినట్లు తెలిపారు. అందుకు గాను ప్రభుత్వానికి రూ. 86.38లక్షల రూపాయల నష్టం కలిగించినట్లు సివిల్ సప్లయీ జిల్లా మేనేజర్ రజినీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిల్ యజమానులైన బండారు శారద, బండారు మారుతిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

మూతపడ్డ పాఠశాలలు తెరుచుకునేదెప్పుడు?


రామబద్రునిపల్లి గ్రామంలో మూతపడ్డ పాఠశాల

పెగడపల్లి, జూన్ 28: మండలంలో మూతపడ్డ పాఠశాలలను తిరిగి తెరిపించేందుకు అధికారులు ప్రజా ప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. మండలంలోని లింగాపూర్ అనుబంధ గ్రామమైన ఉప్పుపల్లె , బతికెపల్లి అనుబంధ గ్రామమైన కొండయ్యపల్లి, రామబద్రునిపల్లి, రాజారాంపల్లి తండా పాఠశాలలు విద్యార్థులు లేరని మూతపడ్డాయి. ఉప్పుపల్లె, కొండయ్యపల్లె, రామబద్రునిపల్లి పాఠశాలలు రెండు, మూడేండ్లుగా తెరుచుకోక పోగా రాజారాంపల్లి తండా పాఠశాల సైతం గత సంవత్సరం మూసివేశారు. ఆయా పాఠశా లలకు పక్కా భవనాలు, టాయిలెట్లు, తాగునీటి వసతి లాంటి సకల సౌకర్యాలు న్నప్పటికి విద్యార్థులు లేరని మూతపడ్డ పాఠశాలలకు విద్యార్థులను రప్పించేందుకు అటు ఉపాధ్యాయులు, ఇటు ప్రజాప్రతినిధులు దృష్టి సారించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. రామబద్రునిపల్లి, రాజారాంపల్లి తండా పాఠశాలలకు ఒక్కో ఉపాధ్యాయుడు వస్తున్నట్లు చెబుతున్నప్పటికీ ఒక్క విద్యార్థి సైతం చేరలేదు. కొండయ్యపల్లి, ఉప్పుపల్లి పాఠశాలలకు ఉపాధ్యాయుల కేటాయింపు పాఠశాలలు తెరిచే ప్రయత్నం సైతం చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పదవి కాదు.. గౌరవం ముఖ్యం

- కేడీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు

కరీంనగర్ టౌన్, జూన్ 28: టెస్కాబ్ చైర్మన్ పదవి నుంచి తనను దించడం ఎవరితో సాధ్యం కాదని, తనకు పదవి కాదు.. గౌరవం ముఖ్యమని కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. కేడీసీసీబీ సమావేశమందిరంలో శుక్రవారం నిర్వహిచిన కేడీసీసీబీ మహాజనసభ సమావేశంలో ఆయన మాట్లాడారు. సహకార సంఘాలకు వన్నెతేవడమే కాకుండా దేశంలోని నాఫ్‌స్కాబ్ చైర్మన్‌గా వ్యవహరించిన కొండూరు రవీందర్‌రావుపై విశ్వాసం లేదంటూ పదవి నుంచి దించేందుకు అవిశ్వాస నోటీసు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండించారు. వారు చేసిన తప్పిదానికి వారు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కేడీసీసీబీ, టెస్కాబ్, నాఫ్‌స్కాబ్ చైర్మన్‌గా సహకార రంగాల బలోపేతానికి చేసిన కృషి అభినందనీయమని, ఆయనకు రుణపడి ఉండాల్సి పోయి అవిశ్వాస లేఖ ఇవ్వడాన్ని, దానికి స్పందిస్తూ అవిశ్వాసానికి ముందే పదవికి కొండూరు రవీందర్‌రావు టెస్కాబ్ పదవిని రాజీనామా చేశారని అన్నారు. దీనికి కొండూరు రవీందర్‌రావు స్పందిస్తూ తనకు పదవి ముఖ్యం కాదని, గౌరవం కోసమే టెస్కాబ్ చైర్మన్ పదవికి రాజీనామా చేశాను... నాకు మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబుతోపాటు సీఎం రేవంత్ రెడ్డితో సహా ఇద్దరు మంత్రులు మినహా మిగిలిన వారంతా సన్నిహితులేనని, అయినా తాను పదవి కోసం ఆరాట పడకుండా రాజీనామా చేశానని అన్నారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ డాక్టర్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, కేడీసీసీబీ వైస్ చైర్మన్ పింగళి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు అంజన్న సన్నిధిలో జ్యేష్ఠాభిషేకం

● 108 కళశాలతో ప్రత్యేక పూజలు



కొండగట్టులో కళశ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మల్యాల, జూన్ 28: కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి సన్నిధిలో శుక్రవారం జ్యేష్ఠాభిషేకం ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం 108 కళశాలతో స్వామి వారికి అభిషేకం చేశారు. ఈవో చంద్రశేఖర్, ఏఈవో అంజయ్య, ఆలయ స్థానాచార్యులు కపీంధర్ ప్రధాన అర్చకులు జితేంద్రప్రసాద్, రామకృష్ణ, రఘు, ఉపప్రధాన అర్చకులు చిరంజీవి, మారుతీ పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, చంద్రశేఖర్ ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

11 లీటర్ల గుడుంబా పట్టివేత



పట్టుబడిన గుడుంబా

కరీంనగర్ క్రైం/చొప్పదండి, జూన్ 28: కరీంనగర్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడుల్లో 11 లీటర్ల గుడుంబా పట్టుబడింది. కరీంనగర్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ కె నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం చొప్పదండి మండలం రాగంపేటలో దాడులు నిర్వహించారు. రాగంపేటకు చెందిన బాసరవేని శ్రీనివాస్ 11 లీటర్ల గుడుంబాతో పట్టుబడగా, ధర్మారం మండలం బంజ రుపల్లికి చెందిన ఇస్లావత్ కేవ్ల నాయక్ పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ హెడ్‌కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుళ్లు కుమార్ యాదవ్, ఖాసీంబీ, కమలాకర్, కమాలుద్దీన్, సంతోష్‌లు పాల్గొన్నారు.

జిల్లా జైలును సందర్శించిన ఐజీ



ఖైదీలతో మాట్లాడుతున్న ఐజీ మురళీబాబు

కరీంనగర్ క్రైం, జూన్ 28: కరీంనగర్ జిల్లా జైలును శుక్రవారం జైళ్లశాఖ ఐజీ మురళీబాబు సందర్శించారు. జైలులో ఖైదీల యోగక్షేమాలు, భోజన వసతులు, న్యాయసేవ, ఆరోగ్య సమస్యల గురించి ఖైదీలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలులో క్యాంటిన్, ఆసుపత్రి, ములాఖత్, ఫోన్ సౌకర్యం, లైబ్రరీ, ఖైదీల టాయిలెట్ల శుభ్రత, వంటశాల, జైలులోని పరిశ్రమ పెట్రోల్‌బంక్‌లో పనితీరును తెలుసుకుని అధికారులను అభినందించారు. జైలులోని గార్డెనింగ్, పరిశుభ్రత బాగుందని అభినందించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా జైలు సూపరింటెండెంట్ కె శ్రీనివాస్, వైద్య అధికారి కె వేణుగోపాల్, జైలర్ పి శ్రీనివాస్, బి రమేష్, డిప్యూటీ జైలర్ ఎ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ సుధాకర్‌రెడ్డి, ఎల్ రమేష్, ఎం సుధాకర్‌రెడ్డి, ఎస్ సంగీత సిబ్బంది పాల్గొన్నారు.

దోపిడీ దొంగల ముఠా అరెస్టు



మాట్లాడుతున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

మెట్‌పల్లి, జూన్, 28: మెట్‌పల్లి పట్టణంలో దోపిడీ దొంగల ముఠాను శుక్రవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. మెట్‌పల్లి డీఎస్పీ కార్యాలయంలో సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై చిరంజీవిలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రలోని కిన్వట్ జిల్లాకు చెందిన కరన్ మరిభా ధోత్రె, సురేష్ అశోక్ పవార్‌లు మెట్‌పల్లి పట్టణానికి చెందిన హనుమంత్ పవార్‌తో కలిసి ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. సీఐ ఆదేశాల మేరకు పట్టణంలో ఎస్సై చిరంజీవి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కరన్ మరిభా ధోత్రె, సురేష్ అశోక్ పవార్‌లు పోలీసులను చూసి పారి పోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకొని విచారించారు. ముగ్గురు కలిసి మెట్‌పల్లి పట్టణంలోని వెల్లుల్ల రోడులోని హన్‌మాన్ నగర్ కాలనీలోని 2023 అక్టోబరు నెలలో బాస రుద్రయ్య ఇంట్లో దొంగతనానికి పాల్పడి సుమారు 10తులాల బంగారం, ఒక సెల్ ఫోన్ ఎత్తుకెళ్కారు. మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని పోచంపల్లి లక్ష్మీ ఇంట్లో 2024 ఏప్రిల్ నెలలో చోరీకి పాల్పడి 5తులాల బంగారం, వెండి అభరణాలు, నగదును అపహరించినట్లు తెలిపారు. వారి నుంచి దొంగతనానికి ఉపయోగించే రెండు ఇనుప రాడ్లు, రూ. 5వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దొంగతనాలు చేయడం అలవాటుగా చేసుకున్నారని వివరిచారు. ముఠాను పట్టుకోవడంలో పకడ్బందీగా వ్యవహరించిన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై చిరంజీవి, హెడ్ కానిస్టేబుల్ సదానందం, కానిస్టేబుల్స్ సంతోష్, కిరణ్‌లను డీఎస్పీ అభినందించారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

ముస్తాబాద్, జూన్ 28: మండలంలోని గూడెం గ్రామానికి చెందిన ఓ యువతి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మూడు రోజుల క్రితం కరీంనగర్‌లో పురుగుల మందు తాగి భాగ్యలక్ష్మి అనే యువతి ఆత్మహత్య యత్నానికి యువతి పాల్పడగా ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం భాగ్యలక్ష్మి మృతి చెందింది. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విల పిస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సంక్షోభంలో వ్యవసాయ రంగం

- రసాయనిక ఎరువులు తగ్గించాలి
- సాంకేతికతను పెంపొందించాలి
- పీజేటీఎస్ఏయూ పరిశోధన విభాగం డైరెక్టర్ రఘురాంరెడ్డి



మాట్లాడుతున్న పరిశోధన విభాగం డైరెక్టర్ రఘురాంండ్డి

వేములవాడ టౌన్, జూన్ 28: తెలంగాణ వ్యవసాయరంగం ఎంతో క్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటుందని, చిన్న రైతులను ప్రభావితం చేస్తూ వాతావరణ సుస్థిరత, ప్రతిస్పందనను ప్రమాదంలో ఉంచుతు న్నాయని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం సాంకేతిక విభాగం పరిశోధన విభాగం (పీజేటీఎస్ఏయూ) డైరెక్టర్ రఘురాంరెడ్డి రైతులకు సూచించారు. వేములవాడ పట్టణంలోని స్థానిక జర్మనీ సేవ్స్ స్వచ్ఛం ద సంస్థ భవనంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెన్నమనేని రమేష్ బాబు ఆదేశాలతో రైతులకు వ్యవసాయంపై డేటా ఆధారిత సాంకేతికతల ద్వారా వర్క్‌షాప్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్యపంటల వ్యవస్థల వైపు రైతులు ఆసక్తి చూపడం వలన ఇన్పుట్ ఖర్చులు పెరగడంతో రైతులు అప్పులపాలవుతున్నారని అన్నారు. ఆధునిక వ్యవసాయం ఆర్థిక ఒత్తిడి లను ఎదుర్కొలేకపోతున్నారని, వ్యవసాయ యాంత్రీకరణ వేగవంతం అవ్వడం, భూగర్భజలాలపై ఎక్కువ ఆధారపడటం అసమానతలను పెంచుతున్నాయని సూచించారు. దీంతో చిన్న, సన్నకారు రైతులను ప్రతికూల పరిస్థితులకు గురిచేస్తుందని తెలిపారు. వాతావరణ మార్పుల వలన అనిశ్చిత వర్షాలు, ప్రతికూల వాతవరణ పరిస్థితులను సృష్టిస్తూ సాంప్రదాయ వ్యవసాయ చక్రాలకు భంగం కలిగించి పంటల దిగుబడులను ప్రమాదంలో ఉంచుతున్నాయన్నారు. మట్టి క్షీణత , నీటి కొరత వంటి సమస్యలు విస్తృతంగా ఉన్నాయని, రసాయన ఎరువులను అతి వినియోగంగా, సమర్థవంతం కాని నీటిపారుదల పద్ధతులు భూగర్భజలాలను ప్రభావితం చేస్తున్నాయని సూచించారు. మౌలిక సవాళ్లు ఎదుర్కొనే సామర్థ్యాన్ని, ఉత్పాదకతను మెరుగుపరచడానికి, వాతావరణ ప్రతిఘటనను ప్రోత్సహించడానికి సమగ్ర పరిష్కారాలను అవలంబించాల్సి ఉందన్నారు. అక్రాట్ ప్రాజెక్ట్‌తో డేటా ఆధారిత సాంకేతికతలను, మానవ కేంద్రిత డిజైన్‌లను ఉపయోగిస్తే, సాంకేతిక ఆవిష్కరణలు, స్థిరమైన సహజ వనరుల నిర్వహణ మధ్య సమతుల్యతను ప్రోత్సహిస్తుందని అన్నారు. స్థిరమైన వ్యవసాయ పద్ధతులు జీవన వైవిధ్య సంరక్షణకు సాంకేతికతను తోడు చేసుకుని ముందుకు సాగాలని తెలిపారు. సులువైన వ్యవసాయ విధానంతో పంట ఉత్పత్తిని ఘననీయంగా పెంపొందించుకోవచ్చని ఆర్థిక అవకాశాలను చిన్న సన్నకారు రైతులు మెరుగుపర్చుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో జర్మనీ సాంకేతికత వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రఘు, డాక్టర్ కల్పన శాస్త్రి, పొలాస విశ్వవిద్యాలయం అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ తదితరులు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మల్యాల, జూన్ 28: దిగువ కొండగట్టులో గల బస్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. జగిత్యాల నుంచి గురువారం కొండగట్టుకు ఆర్టీసీ బస్సులో వచ్చిన్నట్లు మృతుడి వద్ద లభించిన టికెట్‌ను బట్టి తెలుస్తోంది. మృతుడి వయస్సు 60ఏళ్ల లోపు ఉంటుందని ఆచూకి తెలిసిన వారు సంప్రదించాలని మల్యాల ఎస్సై-2 కుమారస్వామి తెలిపారు.

భార్య కేసు పెట్టిందని భర్త ఆత్మహత్య

సైదాపూర్, జూన్ 28: బొమ్మకల్ గ్రామానికి చెందిన నలువాల రాజు(40) అనే వ్యక్తి తన భార్య తనపై కేసు పెట్టిందని ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నలువాల రాజు మద్యానికి బానిసై తన భార్య, కొడుకును తరుచు కొడుతూగొడవ చేసేవాడు. శుక్రవారం రాజు మద్యం సేవించి భార్య, కొడుకును కొట్టి ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. దీంతో భార్య సుమలత గ్రామంలోని పెద్ద మనుషులకు కలిసి సైదాపూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి భర్త రాజుపై ఫిర్యాదు చేసింది. తనపై భార్య పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టిందని తెలుసుకున్న రాజు మద్యం మైకంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సుమలత ఇంటికి తిరిగి వచ్చి చూడగా రాజు ఉరి వేసుకొని కనిపించాడు. ఎస్సై జన్ను ఆరోగ్యం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కొండగట్టుకు పవన్‌కళ్యాణ్

● ఏడాది క్రితం ఎన్నికల రథం వారాహికి పవన్ పూజలు ● ఏపీలో ఘనవిజయంతో దర్శనానికి వస్తున్న ఏపీ డిప్యూటీ సీఎం



కొండపైన ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ, సీఎస్‌వో

మల్యాల, జూన్ 28: ఏపీ డిప్యూటీ సీఎం, జనసేనాని కొనిదెల పవన్‌కళ్యాణ్ శనివారం కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వస్తున్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల ఫలితాల్లో ఘనవిజయం సాధించడంతో ఆ విజయం వెనుక కొండగట్టు ఆంజనేయస్వామి అండ, ఆశీస్సులేనని మొక్కులు చెల్లించుకోవడానికి పవన్ కొండగట్టుకు వస్తున్నట్లు ఆయన అభిమానులు పేర్కొంటున్నారు. గత ఏడాది జనవరి 24న పవన్ కొండగట్టులో పర్యటించి ఏపీలో ఎన్నికల ప్రచారానికి వినియోగించే నూతన వాహనం వారాహికి పూజలు జరిపించారు. అనంతరం ఏపీలో ఆ వాహనంతో ఎన్నికల ప్రచారం చేయడం, అక్కడ పోటీ చేసిన 21 స్థానాల్లో గెలుపొందడం, ఏపీ డిప్యూటీ సీఎంగా పదవిని అలంకరించడం కొండగట్టు ఆంజనేయస్వామి ఆశీస్సులేనని అందులో భాగంగానే కొండగట్టుకు వస్తున్నట్లు తెలుస్తోంది. పవన్ 15ఏళ్ల క్రితం కూడా ప్రజారాజ్యం పార్టీ ప్రచారంలో భాగంగా కొండగట్టుకు వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. జనసేన పార్టీ ఏర్పాటుకు ముందు 2018లో రెండవ సారి రాగ జనసేన పార్టీ ఏర్పాటు చేశాక గతేడాది వచ్చిన పవన్ ఆంజనేయస్వామిని దర్శించుకొని అంజన్న అండతోనే తన రాజకీయ ప్రస్థానం మొదలుపెడుతున్న అని పేర్కొంటూ కొండగట్టులోనే ఎన్నికల ప్రచార వాహనంతో శమరశంఖాన్ని పూరించారు. గతంలో పార్టీ అధినేతగా రాగ ఈ సారి డిప్యూటీ సీఎం హోదాలో అధికారికంగా పర్యటిస్తున్నారు. ఇందుకు గాను దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తుండగా 240 మంది పోలీసులచే భారీ బందోబస్తు చర్యలు చేపట్టారు. ఇదిలా ఉంటే శనివారం పవన్‌కళ్యాణ్ పర్యటన ఏర్పాట్లను ఆయన చీఫ్ సెక్యురిటి అధికారి అర్జున్, జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ రఘుచందర్, సీఐ నీలం రవి పరిశీలించారు.

చోరీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్



మాట్లాడుతున్న మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం,జూన్ 28: మండలంలోని రాజేశ్వర్‌రావుపేట గ్రామ శివారులో జాతీయ రహదారిపై చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను ఇబ్రహీంపట్నం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎస్ఐ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 23న రాజేశ్వర్‌రావుపేట గ్రామ శివారులో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీ వద్దకు ముగ్గురు వ్యక్తులు వెళ్లి డ్రైవర్‌ను కొట్టి అతడి వద్ద నుంచి డబ్బులు, సెల్‌ఫోన్ దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలి పారు. శుక్రవారం మెట్‌పల్లి సీఐ, ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ గండి హన్‌మాన్ ఆలయం వద్ద వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా బైక్‌పై వస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితులైన ఏనుగు వంశీ(మేడిపల్లి), శివరాత్రి గణేస్(భీంగల్), మామడి శివ(మేడిపల్లి) అనే వ్యక్తు ల వద్ద నుంచి 3 సెల్‌ఫోన్‌లు, ఒక బైక్, 8 వేల నగదును స్వాధీనం చేసుకోని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఎన్‌టీపీఏ రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రావు



వెంకటేశ్వర్‌రావు

తిమ్మాపూర్, జూన్ 28: ఎన్‌టీపీఏ రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. హైదారాబాద్‌లో శుక్రవారం తెలంగాణ నాన్ టెక్నికల్ పర్సనల్ అసిస్టెంట్(ఎన్‌టీపీఏ గెజిటెడ్) రాష్ట్ర సంఘం ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలో గల ఇరిగేషన్ సర్కిల్-2లో ఎన్‌టీపీఏగా విధుల నిర్వహిస్తున్న కొలుగూరి వెంకటేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా తెక్కుల రామచంద్రారెడ్డి, సహ అధ్యక్షుడిగా మామిడి రమేశ్, కోశాధికారిగా శెట్టి సురేష్, ఉపాధ్యక్షులుగా వెంకటరమణ, శైలజారాణి, చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా హన్మంతు, లక్ష్మణ్, అనితరాణి, కార్యనిర్వహణ కార్యదర్శిగా బుట్టి సత్యనారాయణ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా రాజమల్లయ్య, గురువయ్య, సైపుల్లా, వినయ్‌కుమార్, సలహాదారులుగా విశ్వంభరాచారి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా యస్ విశ్వంబరాచారి, ఎన్‌టీపీఏ(రిటైర్డ్) వ్యవహరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రజాక్(ఫైల్)

బోయినపల్లి, జూన్ 28: బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన సంఘ టనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. కొదురు పాక గ్రామానికి చెందిన మహమ్మద్ రజాక్ (64) ఇల్లంతకుంటలో నివాసం ఉంటున్నాడు. ద్విచక్రవాహనంపై శుక్రవారం స్వగ్రామానికి వచ్చారు. గ్రామంలో వాహనం అదుపు తప్పి కింద పడి మృతి చెందాడు. ఎస్ఐ పృథ్వీధర్ గౌడ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్ షాపు యజమానిపై కేసు నమోదు

ఇల్లందకుంట, జూన్ 28: మండలంలోని లక్ష్మాజీపల్లె గ్రామానికి చెందిన ఓ బెల్ట్ షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా అక్రమ మద్యం దాదాపు రూ. 19,200 విలువ గల మద్యాన్ని నిల్వ చేసినట్లు అందిన సమాచారం మేరకు తనిఖీ చేసి సరుకు స్వాధీనం చేసుకొని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

తోడేళ్ల దాడిలో గేదె, లేగ దూడ మృతి



మృతిచెందిన గేదె

కోనరావుపేట జూన్ 28: కోనరావుపేట మండలం ధర్మారం గ్రామ శివారులో సత్యనారాయణ పల్లె ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున తోడేళ్ల దాడి చేయగా గేదె, లేగ దూడ మృతి చెందినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. ధర్మా రం గ్రామానికి చెందిన కమిటిరెడ్డి అచ్చిరెడ్డికి చెందిన గేదె, లేగ దూడ రెండింటితోపాటు ఎద్దులను తమ పొలం వద్ద పశువుల పాకలో కట్టేసి ఇంటికి వచ్చాడు. శుక్రవారం తెల్లవారుజామున వెళ్లి చూసేసరికి మృతి చెందినట్లు గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ అధికారులు బాపు రాజు చేరుకొని అడుగులను గుర్తించి తోడేళ్ల దాడిలో రెండు పశువులు మృతి చెందినట్లు గుర్తించారు. దీంతో రూ. 50 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు బాధిత రైతుకు వెంటనే నష్టపరిహారం అందిస్తామని ఎఫ్ఎస్‌వో బాపురాజు తెలిపారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ అడవి ప్రాంత రైతులు జాగ్రత్తగా ఉండాలని సూ చించారు. అటవీ ప్రాంతంలో చిరుతలు తోడేళ్ల తిరుగు తున్నా యని రైతులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రాత్రిపూట తమ పశువులను ఇంటి వద్దనే ఉంచుకోవాలని తెలిపారు.

చుట్టుపక్కల ఇళ్ల తలుపులకు గడియ పెట్టి చోరీకి యత్నం

- స్థానికులు రావడంతో దుండగులు పరార్
- ఒకరిని పట్టుకుని పోలీసులకు అప్పగింత

హుజూరాబాద్, జూన్ 28: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సైదాపూర్ రోడ్‌లోని అహల్యనగర్‌లో శుక్రవారం తెల్లవారుజామున చట్టుపక్కల ఇళ్ల తలుపులకు గడియ పెట్టి చోరీకి యత్నం చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అహల్యనగర్‌లో నివాసం ఉంటున్న సతీష్ అనే వ్యక్తి ఇంటికి ఐదుగురు గుర్తు తెలియని దుండగులు వచ్చారు. మొదట కరెంటును నిలిపివేసి, చుట్టూ పక్కల ఇళ్లల్లో నివాసం ఉంటున్న వారు బయటకు రాకుండా తలుపులకు బయటి నుంచి గడియ పెట్టి ఉంచారు. సతీష్ ఇంట్లో అద్దెకు ఉండే రమేశ్ ఇంటి తలుపులను బాది చోరీకి యత్నం చేశారు. అతను చుట్టూ పక్కల వారికి ఫోన్ చేశాడు. వారు బయటకు రావడానికి ప్రయత్నించగా తలుపులు తెరుచుకోలేదు. దీంతో వారు మరికొంత మందికి ఫోన్లు చేయడంతో పాటు 100కు డయల్ చేశారు. ఈ క్రమంలో అందరు ఒకేసారి రావడంతో గమనించిన దుండగులు పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిలో ఒకరిని స్థానికులు పట్టుకున్నారు. వారి వద్ద ఇనుప రాడ్లు, కట్టర్లు, కత్తులు దొరికాయి ఈ క్రమంలోనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దొంగను అదుపులోకి తీసుకున్నారు. వీరందరూ హరియాణా, బిహార్, ఒరిస్సా భాష మాట్లాడు తున్నారని స్థానికులు తెలిపారు. నెల రోజుల క్రితం అదే కాలనీలోని మహిళా కండక్టర్ ఇంట్లో రూ. 50వేల నగదుతో పాటు బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. అయినప్పటికీ పోలీసులు రాత్రి వేళల్లో గస్తీ పెంచకపోవడంతో దొంగలకు అనుకూలంగా మారింది. కాగా నాలుగు సార్లు ఫోన్ చేసినా పోలీసులు ఆలస్యంగా రావడంపై స్థానికులు విమర్శలు చేస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

జగిత్యాల టౌన్, జూన్ 28: యువతిని హత్య చేసిన కేసులో ఒకరికి జీవిత ఖైదుతో పాటు రూ. 5వేల జరిమాన విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం మెట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన గుండబోయిన నర్సు అనే మహిళ వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తోంది. తనకు రాణి (15) అనే ఒక కూతురు ఉంది. చదువు మానివేసి ఇంటి వద్దే ఉంటోంది. అదే గ్రామానికి చెందిన పాలెపు తిరుమల్ నర్సు కూతురుతో సన్నిహితంగా ఉంటున్నాడు. తిరుమల్ 2016 డిసెంబర్ 7న రాణిని నమ్మించి గ్రామ శివారులో ఉన్న చేద బావి వద్దకు తీసుకెళ్లి మెడకు క్లచ్ వైరు బిగించి హత్యకు పాల్పడి అనుమానం రాకుండా మృతదేహాన్ని చేద బావితో పడేసి పరారయ్యాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన కూతురు తిరిగి రాకపోవడంతో నర్సు పోలీసులను ఆశ్రయించింది. రెండు రోజుల అనంతరం పోలీసుల విచారణలో రాణిని తిరుమల్ హత్య చేసి చేద బావిలో పడేసినట్లు గుర్తించారు. నర్సు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ అశోక్ కేసు నమోదు చేసి నిందితుడైన తిరుమల్‌ను కోర్టులో ప్రవేశ పెట్టారు. కోర్టు పోలీసులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి అయిన తిరుమల్‌కు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ ప్రధాన న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ముద్దాయికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీసుల అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

కలెక్షన్ చేసిన డబ్బులతో డ్రైవర్ పరార్

- పోలీసులకు ఫిర్యాదు చేసి డిస్ట్రిబ్యూటర్

జగిత్యాల టౌన్, జూన్ 28 :కలెక్షన్ చేసిన డబ్బులతో డ్రైవర్ ఉడాయించడంతో ఓ డిస్ట్రిబ్యూటర్ ఫిర్యాదు మేరకు జగిత్యాల పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన చైల్ సింగ్ అనే వ్యక్తి తెలంగాణ ప్రాంతానికి ఫైబ్రోస్ ఎలక్ట్రికల్ కంపెనీకి డిస్ట్రిబ్యూటర్‌గా ఉన్నాడు. తన కంపెనీ లావాదేవీలకు సంబంధించిన విషయంలో చైల్ సింగ్ స్వయంగా వెళ్లి కలెక్షన్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రాజస్థాన్ ప్రాంతానికి చెందిన దయరాం సింగ్ అనే వ్యక్తిని ఏడాది క్రితం తన కారు డ్రైవర్‌గా చైల్ సింగ్ నియమించుకుని వ్యాపారం చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం చైల్ సింగ్ నిజామాబాద్, ఆదిలాబాద్ తదితర పట్టణాల్లో తన కంపెనీకి సంబంధించిన కలెక్షన్ చేసుకుని గురువారం జగిత్యాలకు చేరుకున్నారు. కారును యావర్ రోడ్డు పార్క్ వద్ద పార్కింగ్ చేసి చైల్ సింగ్ కలెక్షన్ కోసం వెళ్లి తిరిగి వచ్చేసరికి కారులో ఉన్న డ్రైవర్ దయరాం సింగ్ కనబడలేదు. కలెక్షన్ చేసిన రూ. 18 లక్షల నగదుతో తన డ్రైవర్ దయారాం సింగ్ తనను మోసం చేసి ఉడాయించాడని పోలీసులకు ఫిర్యాదు చేయగా జగిత్యాల టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పరిహారం కోసం రైతుల నిరసన



రైల్వే పనులను అడ్డుకుంటున్న రైతులు

తంగళ్లపల్లి, జూన్ 28: పరిహారం చెల్లించడం లేదని రైల్వే లైను పనులు జరుగుతున్న ప్రదేశం వద్ద బాధిత రైతులు నిరసన వ్యక్తం చేశారు. బాధిత రైతుల కథనం ప్రకారం.. తంగళ్లపల్లి మండలం నర్సింహులపల్లె గ్రామ శివారులోని 168, 169 సర్వే నంబర్లలో గ్యాదవేని రాములు, పెద్ద నర్సయ్య, చంద్రయ్య, ప్రసాద్, ప్రశాంత్, బాలయ్య, కనకయ్య, చిన్న నర్స య్య, మధులకు చెందిన మొత్తం 10 ఎకారాల భూమి ఉంది. రైల్వే లైను కోసం నాలుగు ఎకారాల భూమిని రెవెన్యూ అధికారులు సేకరించి ఎకారకు ఏడు లక్షల రూపాయల చొప్పున రైతులకు పరిహారం చెల్లించారు. కాని 168 సర్వే నంబరులో ఉన్న రెండు బావులు, ఒక బోరు బావికి సంబంధించి పరిహారం ఇవ్వడం లేదని రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఆరు నెలలుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్న పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికే నాలుగుసార్లు సర్వే చేసి కొలతలు తీసుకున్నారని పరిహారం మాత్రం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే అధికారులను ప్రశ్నిస్తే పోలీసుస్టేషన్‌లో వేయిస్తామని బెదిరింపులకు గురిచేస్తున్నారని అన్నారు. ఉన్నాతాధికారులు జోక్యం చేసుకొని బావులు, బోరు బావి పరిహారం ఇప్పించాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు.

30పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలి

కాల్వశ్రీరాంపూర్, జూన్ 28: కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వాసుపత్రి ప్రస్తుతం ఆరు పడకల ఆసుపత్రిగా మారిందని, గతంలో లాగే 30పడకల ఆసుపత్రి అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్షకు ఎంపీపీ నూనేటి సంపత్ వినతిపత్రం అందజేశారు. ఆసుపత్రిలో పలు సమస్యలు ఉన్నాయని ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో ఇద్దరు ఏఎన్ఎంలకు గాను ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారని మరొక ఏఎన్ఎంను నియమించాలని ఎంపీపీ కలెక్టర్‌ను కోరారు.

పన్నూరులో తైబజార్ వేలం పాట

రామగిరి, జూన్ 28: మండలంలోని పన్నూరు తైబజారు వేలం పాట శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. గ్రామపంచాయతీ స్పెషల్ అధికారి రమేశ్ అధ్యక్షతన డివిజన్ పంచాయతీ అధికారి శంకర్ సమక్షంలో పంచాయతీ కార్యదర్శి సరిత నిర్వహించారు. పెరుమాండ్ల ప్రసాద్ రూ. 3లక్షల40వెలకు తైబజార్ వేలం దక్కించుకున్నారు. ఎంపీటీసీ చిందం మహేష్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మీల్స్ ఆన్ వీల్స్

కళ్యాణ్‌నగర్, జూన్ 28: లయన్స్ క్లబ్ మగువ ఆధ్వర్యంలో గోదావరిఖని బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మగువ జోన్‌ఛైర్మన్ సోమారపు లావణ్య, తానిపర్తి విజయలక్ష్మి, శశికళ పాల్గొన్నారు.

రెస్టారెంట్లలో శానిటరీ సిబ్బంది తనిఖీలు

జ్యోతినగర్, జూన్ 28 : ఎన్టీపీసీలోని రెస్టారెంట్లలో శుక్రవారం రామగుండం కార్పొరేషన్ శానిటరీ అధికారులు, సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. సరైన నాణ్యతా ప్రమాణాలు, నిబంధనలు పాటించని తాజ్ ఫ్యామిలీ రెస్టారెంటు నిర్వాహకులకు 20వేల రూపాయల జరిమానా విధించారు.

అభిప్రాయ సేకరణ సమావేశాలు

సుల్తానాబాద్, జూన్ 28: రైతు భరోసా పథకం కోసం ప్రభుత్వం సలహాలు సూచనలు స్వీకరిస్తుందని, ఇందులో భాగంగా ప్రతి సహకార సంఘం పరిధిలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు కేడీసీసీబీ డైరక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, సుల్తానాబాద్ సింగిల్‌విండో సీఈవో బూరుగు సంతోష్ తెలిపారు. సుల్తానాబాద్ సహకార సంఘం కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం జరిగే సమావేశానికి రైతులు హాజరై సలహాలు సూచనలు అందించాలని కోరారు.

నేడు కానంపల్లిలో పౌరహక్కుల దినం

ధర్మారం, జూన్ 28: మండలంలోని కానంపల్లిలో శనివారం పౌరహక్కుల దినం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ రజిత ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో దండోరా వేయించాలని గ్రామ కార్యదర్శికి సూచించారు.

రేషన్‌కార్డులు మంజూరుచేయాలని దీక్ష

మార్కండేయకాలనీ, జూన్ 28: రేషన్ కార్డులు మంజూరుచేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గోదావరిఖని చౌరస్తాలో న్యూ ఇండియా పార్టీ, అఖిలపక్షం ఆధ్వర్యంలో ఒక్క రోజు నిరాహార దీక్ష నిర్వహించారు. న్యూ ఇండియా పార్టీ బాధ్యులు అశోక వేముల, నాయకులు డాక్టర్ జేవీ రాజు, జనగామ లక్ష్మీనారాయణ, ములుగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అధిష్ఠానం ఆలోచన చేయాలి : జడ్పీ ఛైర్మన్

మంథని, జూన్ 28: టీబీజీకేఎస్ అధ్యక్షుడిగా చెప్పుకుంటున్న రాజిరెడ్డి ఎన్నికపై బీఆర్ఎస్ అధిష్ఠానం ఆలోచన చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ, జడ్పీ ఛైర్మన్ పుట్ట మధు కోరారు. శుక్రవారం తన నివాసంలో పుట్ట మధు విలేకరులతో మాట్లాడుతూ రాజిరెడ్డి అధ్యక్ష ఎన్నికపై తమకు సమాచారం లేదని, అధిష్టానం నియమించిందా లేక వారే ప్రకటించుకున్నారో తెలియదన్నారు. టీబీజీకేఎస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న రాజిరెడ్డి ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీలకు అమ్ముడు పోయి కింది స్థాయి నాయకులకు పార్టీలోకి చేర్పించారని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ ఎంపీటీసీ ఓటమికి ప్రధాన కారణం రాజిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీకి అంతర్గతంగా మద్దతు తెలుపుతూ ఇటు బీఆర్ఎస్‌లో కొనసాగుతూ పార్టీని మోసం చేస్తున్నాడని, ఈ విషయాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తామని, ఈ మేరకు రాజిరెడ్డి వ్యవహారంపై లేఖను పంపిస్తున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్ సింగరేణి కార్మికుల సంక్షేమానికి కృషి చేశారని, వారసత్వ ఉద్యోగాలు ఇప్పించిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదేనన్నారు. గత ఎన్నికల్లో సైతం రాజిరెడ్డి అవినీతిఅక్రమాలతో బీఆర్ఎస్ ఓటమి చెందిందని, కార్మికులు పార్టీని దూరం చేసుకున్నారని వివరించారు. రాజిరెడ్డి అధ్యక్ష ఎన్నిక విషయంలో అధిష్ఠానం పునరాలోచన చేయాలని, అవినీతిఅక్రమాలకు పాల్పడే వ్యక్తిని కార్మిక సంఘ నాయకుడిగా నియమిస్తే పార్టీకి నష్టమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తగరం సుమలత, నేతలు మాచీడి రాజుగౌడ్, సెగ్గెం రాజేష్, తగరం శంకర్‌లాల్‌లు పాల్గొన్నారు.

ఘనంగా పీవీ జయంతి వేడుకలు


జిల్లా కేంద్రంలో వేడుకలు జరుపుకుంటున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు


గోదావరిఖనిలో నివాళులర్పిస్తున్న మేయర్, కాంగ్రెస్ నాయకులు

పెద్దపల్లిటౌన్, జూన్ 28: మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతిని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కడార్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆరె సంతోష్, కమ్మరగోని చౌదరిగౌడ్, ఈర్ల ప్రవీణ్, అరగొండ రాజ్ కుమార్, కొమ్ము శ్రీనివాస్,సజ్జద్ భాయ్, కీర్తి రాజయ్య, గుర్రాల రాజు, కలువల తిరుపతి,, పిన్ రెడ్డి సుధాకర్‌రెడ్డి, మ్యాడగొని శ్రీనివాస్ గౌడ్,పిడుగు రాజారాం, సత్తయ్య పటేల్,రొడ్డ దేవేందర్, ప్రకాష్‌లు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, జూన్ 28: మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతిని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దన్నాయక్ దామోదర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పీవీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు చిలుక సతీష్, నాయకులు గాజుల రాజమల్లు, పన్నాల రాములు, రాజలింగం, రాజయ్య, తిరుపతి, మేకల పోచం, గజభీంకార్ శ్రీనివాస్, అంజయ్య, రమణ, కోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎలిగేడు, జూన్ 28 : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో శుక్రవారం మాజీ ప్రధాని పీవీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, దుగ్యాల సంతోష్‌రావు, జడ్పీ వైస్‌ఛైర్‌పర్సన్ మండల రేణుక ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, తాటిపల్లి రమేష్‌బాబు, సింగిరెడ్డి రాంచందర్‌రెడ్డి, అనిల్ బూర్ల సత్యం, గోపు లక్ష్మారెడ్డి, బాలసాని పర్శమ్‌గౌడ్, కొండ తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మంథని, జూన్ 28: మాజీ ప్రధాని పీవీ జయంతిని పురస్కరించుకుని స్థానికంగా ఉన్న పీవీ కాంస్య విగ్రహానికి జడ్పీ ఛైర్మన్ పుట్ట మధు శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. జడ్పీటీసీ తగరం సుమలత, నేతలు బత్తుల సత్యనారాయణ, ఆరెపల్లి కుమార్, వేల్పుల గట్టయ్యలు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 28: మాజీ ప్రధాని పీవీ జయంతిని శుక్రవారం కాలనీలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. తెలంగాణ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో నాయకులు పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మారెల్లి రాజిరెడ్డి, నాయకులు జక్కుల దామోదర్‌రావు, చక్రపాణి, కిషన్‌నాయక్, అనుము రాములు, చక్రపాణి, తిరుపతిరెడ్డి, ఆకుల రాజిరెడ్డి, సారయ్యానాయక్, రాజేశం, అవినాష్ పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్, జూన్ 28: దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా గోదావరిఖనిలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో మేయర్ బంగి అనీల్ కుమార్ పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్, నాయకులు కాల్వ లింగస్వామి, నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, మహంకాళి స్వామి,ముస్తాపా, మాదరబోయిన రవికుమార్, దీటి బాలరాజు, నాయిని ఓదెలు, కొప్పుల శంకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


మంథనిలో నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్మన్ మధు

కమాన్‌పూర్, జూన్ 28 : మాజీ ప్రధాని పీవీ జయంతి వేడుకలు శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మల్యాల తిరుపతి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రోగులకు పండ్లను పంపిణీ చేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు వైనాల రాజు ఆధ్వర్యంలో పీవీ జయంతి వేడుకలు జరిగాయి. వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో నాయకులు గాండ్ల మోహన్,ఇంగంటి భాస్కర్‌రావు, కోలేటి మారుతి, నగునూరి నర్సాగౌడ్, బాద్రపు శంకర్, ముస్తాక్, ఆకుల ఓదెలు, దాసరి గట్టయ్య, కుక్కరవి, అన్నవేన లక్ష్మీరాజం, రవీందర్, పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు ఉన్నారు. కాగా, పీవీ జయంతి వేడుకల నిర్వహణ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో వర్గ విబేధాలు మరోసారి బహిర్గతమయ్యాయి. పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు వైనాల రాజు ఆధ్వర్యంలో ఒక చోట.. రెండో వర్గం నాయకులు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగాయి. ఇరు వర్గాల మధ్య వాదోపవాదాలు సర్కార్ దవాఖానలో రెండు గంటల పాటు సాగాయి.

గ్రామాల్లో పారిశుధ్య లోపాన్ని నివారించండి

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ రేణుక దేవి


ఎంపీపీని సన్మానిస్తున్న అధికారులు, ఎంపీటీసీలు

ఓదెల, జూన్ 28 : వర్షాలు కురుస్తున్నందున ప్రతి గ్రామంలో పారిశుధ్య లోపాన్ని నివారించాలని ఎంపీపీ రేణుకాదేవి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం రేణుకాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామ వీధుల్లో ప్లాస్టిక్ గ్లాసులు, రోడ్లకు ఇరువైపులా చెత్తకుప్పలు, అధికంగా కనబడుతున్నాయని తెలిపారు. అలాగే చికెన్ సెంటర్ల వద్ద అధికంగా అపరిశుభ్రత ఉంటుందని, దీనివల్ల కుక్కలు అదే సెంటర్ల వద్ద గుంపుగా చేరి అధికమవుతున్నాయని తెలిపారు. కొలనూర్ ఎంపీటీసీ కారెంగుల శ్రీనివాస్‌తో పాటు పలువురు సభ్యులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో బస్ డిపోను ఏర్పాటు చేయాలని ఇందుకు తీర్మానం చేయాలని సభ్యులు కోరారు. గ్రామంలో విద్యుత్ సిబ్బంది జాప్యంతో విద్యుత్ బిల్లుల స్కానింగ్ చేస్తున్నారని దీనివల్ల వినియోగదారులకు 200 యూనిట్లు దాటిపోయి ప్రభుత్వం ప్రకటించిన ఉచిత విద్యుత్ అందడం లేదని తెలిపారు. ఎంపీటీసీలు మాట్లాడుతూ గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు తిరగడం లేదని, గర్భిణుల పేర్లను నమోదు చేసుకోవడం లేదని తెలిపారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఎంపీడీవో తిరుపతి, ఎమ్మార్వో యాకయ్య, ఎంపీవో భాస్కర్, ఏఈలు, అలాగే ఎంపీటీసీ బోడగుంట లక్ష్మి స్వామి, నోముల పద్మావతి ఇంద్రారెడ్డి, ఆరెల్లి సరోజన ముండయ్య, గోపు లావణ్య నారాయణరెడ్డి, కారెంగుల శ్రీనివాస్, ఐరెడ్డి సరోజన కిషన్‌రెడ్డి, రాగిడి రవీందర్‌రెడ్డి, జీల తిరుపతి రెడ్డి స్వరూప, తిప్పారపు శారద సంపత్, కోఆప్షన్ సభ్యుడు శాహెర్ పాల్గొన్నారు. అనంతరం ఎంపీపీ రేణుకదేవిని, ఎంపీటీసీలను అధికారులు సన్మానించారు. ఇక్కడ విధులు నిర్వహించి బదిలీ అయిన ఎంపీడీవో సత్తయ్యను సిబ్బంది, ప్రజాప్రతినిధులు సన్మానించారు.

సహకార రంగానికి వన్నె తెచ్చాం

- సమస్యల పరిష్కారానికి కృషి
- మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో మార్క్‌ఫెడ్ ఛైర్మన్‌గా నాకు, కేడీసీసీబీ ఛైర్మన్ కొండూరి రవీందర్‌రావుకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చారు.. మార్క్‌ఫెడ్‌కు అడగ్గానే వెయ్యి కోట్లను ప్రభుత్వం అప్పుగా తీసుకొని ఇచ్చింది. ఇఫ్కోకు ఫర్టిలైజర్స్ కోసం ఒకేసారి 250 కోట్ల రూపాయల చెక్కు ఇచ్చి ఎరువులు తీసుకువచ్చాం. వరి, మొక్కజొన్న కొనుగోళ్లకు, సహకార సంఘాల ఛైర్మన్లకు ప్రొటోకాల్ కల్పించే విధంగా జీవో తీసుకువచ్చి సహకార రంగానికే వన్నె తెచ్చాం' అని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం కేడీసీసీబీ ఛైర్మన్ కొండూరి రవీందర్‌రావు అధ్యక్షతన కరీంనగర్‌లో జరిగిన మహాజన సభ సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కేడీసీసీబీ, డీసీఎంఎస్, చేనేత సహకార సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తనకు రాజకీయ జన్మనిచ్చింది సహకార రంగమేనని, ఏ పదవిలో ఉన్నా సింగిల్ విండో ఛైర్మన్‌గా మీతోనే ఉంటానన్నారు. అన్ని పార్టీలు సామరస్యంతో కలిసి పనిచేసి సహకార రంగానికి ఊపిరి పోద్దామని చెప్పారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో సమన్వయంగా కార్యక్రమాలను రూపొందించుకొని సహకార సంఘాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని ఛైర్మన్లు, పాలకవర్గాలకు సూచించారు. సిరిసిల్ల, ఇతర ప్రాంతాల చేనేత కార్మికులకు అండగా ఉంటామని మంత్రి ప్రభాకర్ ప్రకటించారు.

గెస్ట్ లెక్చరర్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి రూరల్, జూన్ 28 : జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అతిథి అధ్యాపకుల నియామకానికి ఆసక్తి, అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశా ప్రిన్సిపాల్ డా. లక్ష్మీనర్సయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ 1, హిస్టరీ 1, పొలిటికల్ సైన్స్ 1, మ్యాథమెటిక్స్ 1, కంప్యూటర్స్ 1, గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు1, పొలిటికల్ సైన్స్ 1, మ్యాథమెటిక్స్ 1, బోటని 1 , కంప్యూటర్స్ 2 , మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ 1, తెలుగు 1, పొలిటికల్ సైన్స్ 1, కంప్యూటర్స్ 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని , అర్హత గల అభ్యర్థులు దరఖాస్తులను ఆయా కళాశాలల్లో జూలై 1 సాయంత్రం 4 గంటలలోపు సబ్మిట్ చేయాలని కోరారు. అభ్యర్థులకు పీజీలో కనీసం 55 శాతం ఉత్తీర్ణులై ఉండాలని , ఎస్సీ, ఎస్టి అభ్యర్థులు 50 శాతం ఉండాలని తెలిపారు. నెట్, సెట్, పిహెచ్‌డి గల వారికి ప్రాధాన్యత ఉంటుందని, జూలై 2న ఉదయం 10గంటలకు పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● డీఈవో మాధవి

జ్యోతినగర్, జూన్ 28: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని డీఈవో మధవి అన్నారు. శుక్రవారం ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జడ్పీ పాఠశాలలో నిర్వహించిన నేషనల్ గ్రీన్ కోర్(ఎన్‌జీసీ) జిల్లాస్థాయి పోటీల కార్యక్రమానికి డీఈవో ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు సరైన అవగాహన ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి తమ ఇంటిలో మొక్కలు నాటాలని, కాలుష్య రహిత సమాజ నిర్మాణానికి విద్యార్థులు చేయూతనందించాలని సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎన్‌జీసీ ఆధ్వర్యంలో భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకునే అంశంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. పోస్టర్ మేకింగ్ డ్రాయింగ్, కవితల పోటీలలో జిల్లాలోని అన్ని ఎన్‌జీసీ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్‌జీసీ అధికారి బి.విద్యాసాగర్, జిల్లా కోఆర్డినేటర్లు బూళ్ల అంజన్ కుమార్, హెచ్‌ఎం జి.జయరాజు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల బస్సులను అడ్డుకున్న గ్రామస్థులు


ప్రైవేట్ పాఠశాల బస్సును నిలిపివేసిన గ్రామస్థులు

కాల్వ శ్రీరాంపూర్, జూన్ 28: మండలంలోని కునారం గ్రామానికి విద్యార్థుల కోసం వచ్చిన ప్రైవేట్ పాఠశాలల బస్సులను గ్రామస్థులు శుక్రవారం అడ్డుకున్నారు. గ్రామంలోని పిల్లలు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లడం వల్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల మూతపడే ప్రమాదం ఉందని, ఏ ప్రైవేటు పాఠశాల స్కూల్ బస్సులు గ్రామానికి రావద్దని కొద్దిసేపు ఆందోళన చేశారు. అనంతరం గ్రామంలోకి వచ్చిన ప్రైవేట్ పాఠశాల బస్సులో నుంచి కూనారం గ్రామానికి చెందిన విద్యార్థులను దింపివేసి బస్సును వెళ్లగొట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డొంకెన విజయమొగిలి, ఎంపీటీసీ కొల్లూరి రమాదేవిరాజమల్లు, మాజీ ఎంపీటీసీ సాదనవేన కొమురయ్య పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ఎలిగేడు, జూన్ 28 పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత అని ఎంపీడీవో భాస్కర్‌రావు అన్నారు. మండలంలోని 12గ్రామాల్లో స్వచ్ఛ శుక్రవారం, డ్రైడే కార్యక్రమాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించామన్నారు. అందులో భాగంగా ధూళికట్ట గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. సహాయ సిబ్బందితో అధికారులు పనులు చేశారు. ఆయనతో ఎంపీవో అనిల్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఏఈలు జగదీశ్వర్, యశశ్రీ, సంపత్‌రెడ్డి, ఐకెపిఏపీఎం సుధాకర్, ఏవో జగదీశ్వర్, సీసీలు జ్యోతిమల్లేష్, ఆనంద్, పంచాయతీ కార్యదర్శులు వివోఏ వైద్య, పారిశుధ్య సిబ్బంది, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో అధిక లాభాలు

పెద్దపల్లి రూరల్, జూన్ 28: రైతులు పంటలు సాగు చేసే సమయంలో విత్తన శుద్ధి చేస్తే అధిక లాభాలు పొందుతారని మండల వ్యవసాయాధికారిణి అలివేణి అన్నారు. శుక్రవారం మండలంలోని నిమ్మనపల్లి గ్రామంలో వరి, ఇతర పంటల విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో అలివేణి పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శిరీష, రైతులు వేల్పుల నంబయ్య, నర్సింగం, మల్లికార్జునరావు, రైతులు పాల్గొన్నారు.

వేగవంతంగా గోదాం నిర్మాణ పనులు

పెద్దపల్లి రూరల్ , జూన్ 28 : మండలంలోని అప్పన్నపేట వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో కనగర్తి గ్రామంలో చేపడుతున్న ఎరువుల గోదాం నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. రానున్న కొద్ది రోజుల్లోనే గోదాం నిర్మాణం పూర్తి చేసి కనగర్తి, బొంపల్లి, కాపులపల్లి, గోపయ్యపల్లి, పాలితం, కాసులపల్లి, పుట్టపల్లి గ్రామాల రైతులకు గోదాం నుండే ఎరువులను సరఫరా చేయనున్నట్లు సింగిల్ విండో ఛైర్మన్ చింతపండు సంపత్ తెలిపారు. ఈ సందర్భంగా సింగిల్ విండో డైరెక్టర్ యెల్లెంకి స్వామి నిర్మాణ పనులను పరిశీలించారు.

ఖని జనరల్ ఆసుపత్రిలో వైద్యుల నిరసన


ఆసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న వైద్యులు

కళ్యాణ్‌నగర్, జూన్ 28: వైద్య వృత్తితో సంబంధం లేని ఉద్యోగులు ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేయడం సరికాదని గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్యులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆర్థో ప్రొఫెసర్ రాజు మాట్లాడుతూ నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య వృత్తికి సంబంధం లేని రెవెన్యూ ఉద్యోగులు ఆసుపత్రిలో పెత్తనం చెలాయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, వైద్య వృత్తి అనుభవం గల వారు తనిఖీ చేస్తే బాగుంటుందని, వృత్తికి సంబంధం లేని రెవెన్యూ ఉద్యోగులకు ఆసుపత్రిలో సమస్యలు, కావాల్సిన అవసరాలు ఎలా తెలుస్తాయని ఆయన ప్రశ్నించారు. తనిఖీల పేరుతో తమను వేధింపులకు గురి చేయవద్దన్నారు. వృత్తిపై పూర్తి అవగాహన ఉన్నవారితో కానీ, కలెక్టర్‌తో కానీ, జాయింట్ కలెక్టర్‌తో కానీ తనిఖీలు నిర్వహించాలని, తమ స్థాయి లేనివారితో తనిఖీలు నిర్వహిస్తే వైద్యవృత్తినే అవమానించినట్లు అన్నారు. ఈ నిరసనలో వైద్యులు రవి వర్మ, ఫరీద్, స్వామి, లక్ష్మి, ప్రియాంక, హర్షిణి, ప్రశంస, ఆదిష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్ చేస్తే కఠిన చర్యలు

కోల్‌సిటీ, జూన్ 28: ఈవ్ టీజింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని, విద్యార్థినిల పట్ల, మహిళల పట్ల మర్యాదగా నడుచుకోవాలని మహిళా విభాగం సేఫ్టీ డీఐజీ రెమా రాజేశ్వరి హెచ్చరించారు. శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో యువతులను వేధింపులకు గురి చేసిన 42మంది ఈవ్ టీజర్లతో జూమ్ సమావేశం ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని, వారిని వేధిస్తే ఎలాంటి శిక్షలకు గురవుతారో ఆకతాయిలకు వివరించారు. మహిళల పట్ల మర్యాదగా నడుచుకోవాలని ఆమె సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ బుద్ధె స్వామి, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ రాజమౌళిగౌడ్, పెద్దపల్లి షీటీమ్ ఎస్ఐ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

కోల్‌సిటీటౌన్, జూన్ 28: గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా ఇంచార్జీ నోడల్ అధికారి జి.మాధవి శుక్రవారం విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల ఇంచార్జీ ప్రిన్సిపల్ శ్రీధర్, లైబ్రేరియన్ కె.శంకరయ్య, జి.కనకయ్య, శ్రీనివాస్, పిరాజిరెడ్డి, శ్రీగోదా, శారద ఉన్నారు.



విధులకు క్రమం తప్పకుండా హాజరుకావాలి

- ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు

రామగిరి, జూన్ 28: సింగరేణి కార్మికులు క్రమం తప్పకుండా విధులకు హాజరుకావాలని ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లలో 180 గైర్హాజరు కార్మికులను గుర్తించిన సింగరేణి సీఎస్‌సీవోఏ క్లబ్‌లో కార్మిక కుటుంబాలతో ఏర్పాటు చేసిన కౌన్సెలింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2023 సంవత్సరం జనవరి నుంచి డిసెంబరు మధ్య కాలంలో 100 మస్టర్లు పూర్తిచేయని వారు, ఈ సంవత్సరంలో మేనెల వరకు కనీసం 50 మస్టర్లు నిండని కార్మికులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ చేపట్టారు. ఈ సమావేశానికి 150 మంది కార్మికులు, వారి కుటుంబ సభ్యులు హాజరైయ్యారు. ఈ సందర్భంగా వారికి సమస్యలతో పాటు అనారోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విధులకు సక్రమంగా హాజరుకాకుండా ఉండడంతో సింగరేణికి ఉత్పత్తికి విఘాతం ఏర్పడే ఆస్కారం ఏర్పాడుతుందని జీఎం వెల్లడించారు. సింగరేణి కార్మికులకు అనేక వసతులు కల్పిస్తున్నప్పటికి విధులకు గైర్హాజరు కావడంపై వివరణ ఇవ్వాలని సూచించారు. మూడు నెలల పాటు పర్యవేక్షిస్తామని, ప్రవర్తనలో ఆశించిన మార్పు రాని పక్షంలో చర్యలు తీసుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అధికారులు నాగేశ్వర్‌రావు, సత్యనారాయణ, నాయకులు జూపాక రాంచందర్, సమ్మయ్య, అధికారులు ముప్పిడి రవీందర్‌రెడ్డి, డాక్టర్ పద్మ, హరిష్, మతీన్, హుస్సేన్, రవిచంద్ర, పిట్ సెక్రెటరీ కొమురయ్య, గంగాధర్‌లతో ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రింటర్‌ను ప్రారంభించిన జీఎం

రామగిరి, జూన్ 28: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని జీఎం కార్యాలయంలో శుక్రవారం నూతన కలర్ ప్రింటర్‌ను ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు ప్రారంభోత్సవం చేశారు. జీఎం కార్యాలయంలోని సర్వే విభాగంలో రూ.2.5 లక్షలతో కొనుగోలు చేసిన నూతన ప్లోటర్ కలర్ ప్రింటర్‌ను జీఎం ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు రఘుపతి, శ్రీనివాసులు, జనార్ధన్ రెడ్డి, పద్మరాజులు పాల్గొన్నారు.

సివిల్ డీజీఎంకు ఘన సన్మానం

రామగిరి, జూన్ 28: సింగరేణి సంస్థ ఆర్జీ-3,ఏపీఏ సివిల్ డీజీఎం పద్మరాజు దంపతులను సత్కరించారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈనెల పదవీ విరమణ పొందుతున్న పద్మరాజును ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు, అధికారులు శాలువ, పూలదండలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీనివాసులు, రఘుపతి, రాధాకృష్ణ, రాజేందర్, వెంకటరమణ, శేఖర్‌బాబు, చంద్రశేఖర్, ముప్పిడి రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలగకుండా చూడాలి

- డైరెక్టర్ ఎన్వీకే శ్రీనివాస్

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 28: వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకాలు ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్వీకే శ్రీనివాస్ ఓసీపీ-3 అధికారులకు సూచించారు. గురువారం ఓసీపీ-3 ప్రాజెక్టును ఆయన సందర్శించారు. క్వారీలో బొగ్గు వెలికితీత పనులను పరిశీలించారు. వర్షాలు పెరుగుతున్నందున క్వారీలో వరదనీరు నిల్వ ఉండకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. డ్రైన్లను, క్వారీలోకి వచ్చే కాల్వలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, వరద నీటితో రోడ్లు పాడవకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. డైరెక్టర్ వెంట జీఎం సూర్యనారాయణ, పీవో మధుసూదన్, సర్వే అధికారి నరసింహారావు, ఎస్ఎస్‌వో షరీఫ్‌మహమ్మద్ ఉన్నారు.


ఓసీపీ-3 క్వారీని పరిశీలిస్తున్న డైరెక్టర్ ఎన్వీకే శ్రీనివాస్

స్థలం కబ్జాకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

గోదావరిఖని, జూన్ 28: రామగుండం మండలం మల్కాపూర్ శివారుకు సంబంధించి సర్వే నెంబర్ 83లోని సింగరేణి స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సింగరేణి ఆర్జీ-1 జీఎంను ఏఐవైఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్‌కు ఏఐవైఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి మార్కపురి సూర్య వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 83 సర్వే నంబర్‌లోని సింగరేణి స్థలం సాయిలీల బార్ అండ్ రెస్టారెంట్‌కు అనుకొని ఉండటం వల్ల ఆ స్థలం కనపడకుండా చుట్టూ చెట్లు నాటి హోటల్ నిర్వాహకులు దానిని పార్కింగ్ స్థలంగా వాడుకుంటూ ఆ స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సుమారు 8 నుంచి 10 గుంటల భూమి రెండు కోట్ల విలువ చేసే స్థలాన్ని సింగరేణి యాజమాన్యం కాపాడుకోవడానికి స్పందించాలని కోరారు.

కబ్జాకు యత్నిస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, ఈ విషయంపై సింగరేణి ఎస్టేట్ అధికారులు, ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడం విచారకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

క్వార్టర్ల కూల్చివేత ప్రక్రియ ప్రారంభం


సింగరేణి క్వార్టర్లను కూల్చివేస్తున్న ఎక్స్‌కవేటర్

గోదావరిఖని, జూన్ 28: వ్యాపార కూడలి అభివృద్ధిలో భాగంగా సింగరేణిలో 40ఏళ్లకు పైబడిన క్వార్టర్లను కూల్చివేతకు సింగరేణి యాజమాన్యం శ్రీకారం చుట్టింది. గోదావరిఖని చౌరస్తాలోని డీ-161, 162క్వార్టర్లను శుక్రవారం సింగరేణి యాజమాన్యం కూల్చివేసింది. గోదావరిఖనిలో రోడ్లవెడల్పులో భాగంగా క్వార్టర్లను తొలగించాలని సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌కు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ విజ్ఞప్తి చేశారు. దీంతో సింగరేణి యాజమాన్యం 92 క్వార్టర్ల తొలగింపునకు నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు నాలుగు నెలల క్రితం క్వార్టర్లను ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేసింది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో తాత్కాలికంగా కూల్చివేతలకు బ్రేక్ పడింది. తిరిగి శుక్రవారం నుంచి క్వార్టర్ల తొలగింపును ప్రారంభించారు. మిగతా క్వార్టర్లలో నివాసముండే వారికి సెక్టార్-1లోని వివిధ ఏరియాల్లోని క్వార్టర్లను కేటాయించింది. సింగరేణి యాజమాన్యం ఇచ్చిన గడువులోగా క్వార్టర్లను ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది.